సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

మంగళవారం । 4 । ఫిబ్రవరి । 2025



రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్) సీఎంఓ సాయి రమేష్ తెలిపారు. - 8లో



హోంగార్డ్స్ క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

హోంగార్డుల సేవలు అభినందనీయమని, క్రమశిక్షణతో విధులను నిర్వర్తించాలని కమాండెంట్ మహేష్‌కుమార్ తెలిపారు. - 8లో

గరిష్టం/కనిష్టం
34.1 /14.8

వాతావరణం

జిల్లాలో సోమవారం 14.8 - 34.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

నేడు కేవీకేలో శాస్త్రీయ సలహా మండలి సమావేశం

– కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య

కడప అగ్రికల్చర్ : కడప నగర శివార్లలోని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం శాస్త్రీయ సలహా మండలి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు కేవీకే కేంద్రం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య తెలిపారు. ఈ సమావేశం గుంటూరు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ జి. శివనారాయణ అధ్యక్షతన జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం 2024–25 సంవత్సరానికి గాను జరిపిన సాంకేతిక కార్యక్రమాల పురోగతిపై చర్చ, సమీక్ష ఉంటుందని తెలిపారు. అలాగే 2025–26 సంవత్సరంలో చేపట్టబోయే కార్యచరణ ప్రణాళిక మీద సమీక్ష చేయనున్నట్లు వివరించారు.

పీజీ మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలను సిబ్బందితో కలిసి విడుదల చేస్తున్న వీసీ కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : యోగివేమన విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల ఎమ్మెస్సీ, ఎంఏ, ఎంకాం మూడో సెమిస్టర్ పరీక్షలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం తమ చాంబరులో రిజిస్ట్రార్ ఆచార్య పి. పద్మ, పరీక్షల నియంతణ అధికారి ఆచార్య కేఎస్వీ కృష్ణారావుతో కలిసి ఎమ్మెస్సీ, ఎంఏ, ఎంకాం గ్రూపులకు సంబంధించి పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. సకాలంలో ఫలితాలు విడుదల చేసిన పరీక్షల విభాగాన్ని వీసీ అభినందించారు. విద్యార్థులు ఫలితాల కోసం వైవీయూ వెబ్సైట్‌ను సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో సహ పరీక్షల అధికారులు డా. మమత కుమారి, డా.కనుసు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పరిశీలన



ఏపీ కార్ల్‌లో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న విదేశీ బృంద సభ్యులు

పులివెందుల రూరల్ : కేఎఫ్‌డబ్ల్యూ ఆర్గనైజేషన్ విదేశీ బృందం సోమవారం నుంచి ఈ నెల 7వ తేదీవరకు వైఎస్సార్ జిల్లాలో పర్యటించనున్నారు. ఇందులో భాగంగా సోమవారం పులివెందుల పట్టణంలోని ఏపీ కార్ల్‌లోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని విదేశీ బృంద సభ్యులు అన్న, మార్కు సంగీత్ అగర్వాల్ తదితరులు సందర్శించారు. వీరి వెంట ఇతర రాష్ట్రాల బృంద సభ్యులతో పాటు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్వీ ప్రవీణ్ కుమార్, ఏపీ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శివారెడ్డి, తదితరులు ఉన్నారు.

నేడు జిల్లా సమీక్షా కమిటీ సమావేశం

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా సమీక్షా కమిటీ సమావేశం మంగళవారం ఉదయం 10.30 నుంచి కలెక్టరేట్‌లో ప్రారంభం కానుంది. కలెక్టర్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత సమావేశానికి హాజరు కానున్నారు. ఆమె ఉదయం 7.25 గంటలకు కడప రైల్వేస్టేషన్‌కు చేరుకుని .. అక్కడి నుంచి గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. అనంతరం 9.10 నుంచి 9.45 గంటల వరకు డిల్లీ పబ్లిక్ స్కూలులో జరిగే వార్షికోత్సవంలో పాల్గొంటారు. ఆపై 10 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకుని డీఆర్సీ సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 తర్వాత గెస్ట్‌హౌస్‌కు చేరుకుని స్థానిక నాయకులతో సమావేశమవుతారు. సాయంత్రం పెనుగొండకు బయలుదేరి వెళతారు.

భక్తిశ్రద్ధలతో పల్లకీ ఉత్సవం



పల్లకీలో ఊరేగుతున్న భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్ : రాయచోటి భద్రకాళీ సమేతుడికి పల్లకీ సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం రాత్రి స్వామి, అమ్మవార్ల మూల విరాట్‌లను రంగు రంగుల పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం పల్లకీలో కొలువుదీర్చారు. ఆలయ మాఢవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఈవో డివి రమణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

దేవదేవుడి దివ్య మోహన రూపాన్ని తిలకిస్తున్న భక్తులకు ఇరువైపులా అరటిపిలకలు స్వామి కల్యాణ శోభను రెట్టింపు చేశాయి. మామిడి తోరణాలు మంగళకరమైనదని చాటుతున్నట్లు కనిపించాయి. సమ్మోహన రూపంలో ధగధగలాడే నూతన వస్త్రాలతో వరుడిగా కడపరాయుడు కొలువుదీరగా, మరోవైపు ముగ్ధ మనోహర రూపాలతో శ్రీదేవి, భూదేవి అమ్మవారలు వధువులుగా ఒదిగి కూర్చొన్నారు. మంచి గంధం, మధుర పరిమళం, మంగళ వాయిద్యాల సుస్వరాలు మైమరిపిస్తుండగా దేవ దేవుడి కల్యాణం.. ఆద్యంతం కమనీయంగా జరిగింది. అర్చకులు కల్యాణ క్రతువును క్రమంగా జరిపించారు. అర్చకులు స్వామి పక్షాన అమ్మవారల గళసీమల్లో మంగళ సూత్రాలను అలంకరించారు. తలంబ్రాలు కార్యక్రమాన్ని ఉత్సాహ భరితంగా నిర్వహించారు. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు కప్పురపు పరిమళాల కడప రాయుని కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

– కడప కల్చరల్



భక్తులకు మంగళసూత్రం చూపిస్తున్న అర్చకులు

కల్తీ కథ.. ఎవరి పాత్ర ఎంత?

- తెలుగుతమ్ముళ్ల నేతృత్వంలో కల్తీ మద్యం నెట్‌వర్క్
- స్పిరిట్‌తో మద్యం తయారీ
- మందుబాబుల ప్రాణాలతో చెలగాటం



సాక్షి ప్రతినిధి, కడప : ఎన్నికలకు ముందు నాణ్యమైన మద్యం...సరసమైన ధరల్లోనే ఇస్తానని చంద్రబాబు ఇచ్చిన హామీ అధికారంలోకి వచ్చాక రివర్స్ అయ్యింది. విచ్చలవిడి మద్యం షాపులు, వాటికి అనుసంధానంగా బెల్టు షాపులు యథాతథం కాగా..ఇప్పుడు కల్తీ మద్యం మాఫియా మొదలైంది. కేవలం స్పిరిట్ నింపి మందు బాబుల గొంతులు తడుపుతున్నారు. దీని కోసం తిరుపతి, రైల్వేకోడూరు, రాజంపేట ప్రాంతాల్లో ప్రత్యేకంగా తయారీ కేంద్రాలు కూడా వెలిశాయి.

ఇప్పటికే 90 రూపాయలకే ఇచ్చే మద్యంపై అనేక అనుమానాలుంటే...తాజాగా కూటమి ప్రభుత్వంలో కల్తీ మద్యం దందా ప్రారంభమైంది. కేవలం స్పిరిట్‌తో మద్యం తయారు చేస్తూ మందు బాబుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కేరళ నుంచి స్పిరిట్ తెప్పించి...అన్నమయ్య జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాల్లో కల్తీ మద్యం తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసి విచ్చలవిడిగా మార్కెట్‌లోకి వదిలేస్తున్నారు. ఎన్నికలకు ముందు నాణ్యమైన మద్యం అందిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మాట దేవుడెరుగు.. ఇప్పుడు కల్తీ మద్యాన్ని అరికట్టలేని పరిస్థితికి వచ్చేసింది. కూటమి నేతల కనుసన్నల్లోనే ఈ వ్యాపారం సాగుతుందనేది బహిరంగ రహస్యమే. అయినా వాళ్ల పేర్లు బయటకు రాకుండా అనామకులపై కేసులు పెట్టి చేతులు దులుపుకుంటున్నారు. ఇటీవల తిరుపతిలో ఈ మద్యం రాకెట్ వెలుగులోకి రాగా రైల్వేకోడూరులో రెండు సార్లు ఎక్సైజ్ అధికారులు కల్తీ మద్యాన్ని స్వాధీనం చేసుకుని తయారీ కేంద్రాలను కూడా గుర్తించారు.

లోతైన విచారణకు పాతర...

కల్తీ మద్యం కోసం తిరుపతి కేంద్రంగా పెద్ద నెట్‌వర్క్ నడుస్తున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ విషయం ఎక్సైజ్‌శాఖ అధికారులకు తెలిసినా బడాబాబుల పేర్లు బయటకు రాకుండా అనామకులను కేసులో పెట్టి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు మెండుగా వినిపిస్తున్నాయి. ఇప్పటికే తిరుపతి, రైల్వేకోడూరుతో పాటు రాజంపేటలోనూ ఈ నకిలీ మద్యం తయారీ కేంద్రాలను గుర్తించి దాడులు చేశారు. దీంట్లో ఒకరిద్దరిని అరెస్టు చేసి చేతులు దులుపుకున్నారు. కానీ ఈ రాకెట్ వెనుక ఎవరున్నారు..? కేరళ నుంచి స్పిరిట్ ఎవరు తెప్పిస్తున్నారు..? లేబుళ్లు, స్టిక్కర్లు ఎక్కడ తయారవుతున్నాయనే కోణంలో మాత్రం స్పష్టత లేకుండా పోయింది. లోతైన విచారణకు పాతరేశారు. రాజంపేట తయారీ కేంద్రాన్ని గుర్తించినప్పుడు తమకు కావాల్సిన వారి పేర్లు బయటకు రాకుండా ఉండటం కోసం తిరుపతికి చెందిన ఓ నేత రోజంతా రాజంపేట అధికారుల చుట్టూనే తిరిగినట్లు సమాచారం. ఒక్కో చోట వేల లీటర్ల స్పిరిట్, వందల కొద్దీ బాటిళ్లు, స్టిక్కర్లు, లేబుళ్లు దొరుకుతున్నాయి. ఇవన్నీ తిరుపతి కేంద్రంగానే వస్తున్నాయనే ప్రచారం సాగుతోంది. దొరికిన ప్రాంతాలను పక్కన పెడితే ఇంకా ఎక్కడెక్కడ ఈ దందా ఎంతమేరకు విస్తరించిందనే కోణంలో విచారణ కొనసాగడం లేదు. ఎక్సైజ్ అధికారులు మాత్రం స్థానికంగా దొరికిన వారిని అరెస్ట్ చేసి మమ అనిపిస్తున్నారు తప్ప కల్తీ మద్యం రాకెట్ సూత్రధారులు, పాత్రధారులు ఎవరన్న కోణంలో విచారణ చేపట్టడం లేదు. దీనికి రాజకీయ ఒత్తిళ్లే కారణమనే విమర్శలూ లేకపోలేదు.

జంకుతున్న ఎక్సైజ్‌శాఖ...

అధికారపార్టీ నేతల నోటి దూలకు ఎక్సైజ్‌శాఖ జంకుతోంది. అందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయి. వైఎస్సార్ జిల్లా కమలాపురం, వీరపునాయునిపల్లె ప్రాంతాల్లో అనధికారిక మద్యం షాపులు వెలిశాయి. బ్రాందీషాపుల నిర్వాహకులతో సంబంధం లేకుండా బంకులు ఏర్పాటు చేసి మద్యం షాపులను కొనసాగిస్తున్నారు. అధికారిక మద్యం షాపునకు చెంతలోనే తెలుగుతమ్ముళ్లు అక్రమంగా మద్యం షాపులను కొనసాగిస్తున్నా నియంత్రించే దిశగా ఎక్సైజ్‌శాఖలో అడుగులు పడడం లేదు. ఇలాంటి పరిస్థితి జిల్లాలో అనేక ప్రాంతాల్లో ఉంది. అధికార పార్టీ నేతల భాగస్వామ్యం లేని మద్యం షాపుల నిర్వాహకులకు చుక్కలు చూపిస్తున్నారు. ఓవైపు కల్తీ మద్యం మరోవైపు విచ్చలవిడి బెల్ట్‌షాపులతో తెలుగుతమ్ముళ్లు ఎక్సైజ్‌శాఖ యంత్రాంగాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

నేటి నుంచి క్రీడా, సాంస్కృతిక సంబరం



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

రైల్వేకోడూరు అర్బన్ : అన్నమయ్య జిల్లా అనంతరాజునేటలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో అంతర్ కళాశాలల రాష్ట్రస్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలు మంగళవారం నుంచి జరగనున్నాయి.7వతేదీ వరకు జరిగే ఈ పోటీలకు 9 కళాశాలలకు చెందిన క్రీడాకారులు హాజరుకానున్నారు.సోమవారం డీఎస్ఏ డాక్టర్ సూర్యకుమారి, అసోసియేట్ డీన్ శ్రీనివాసులు క్రీడల నిర్వాహణకు ఏర్పాట్లు, క్రీడాకారులకు వసతులను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ పరిధిలో 9 ఉద్యాన కళాశాలలు ఉన్నాయని, మొత్తం 3 వేల మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. క్రీడా 7 సంవత్సరాల తరువాత రెండోసారి ఇక్కడ క్రీడా, సాంస్కృతిక సంబరాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్య అతిథిగా వీసీ గోపాల్, విశిష్ట అతిథులుగా రాష్ట్ర శాప్ చైర్మన్ రవినాయుడు, రాజంపేట ఏఎస్పీ మనోజ్‌రామనాథ్‌హెగ్డే హాజరుకానున్నట్లు తెలిపారు.

5 అంశాల్లో పోటీలు:

9 ఉద్యాన కళాశాలల నుంచి 450 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొననున్నారు. క్రీడలు, డ్యాన్స్, లిటరరీ, ఫైన్ ఆర్ట్స్ విభాగంలో పోటీలు ఉంటాయి. ఇందులో ప్రతిభ కనబరిన వారిని జాతీయ స్థాయి పోటీలకు పంపనున్నారు.మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మార్చ్‌ఫాస్ట్ జరుగుతుంది. జ్యోతిప్రజ్వలన అనంతరం పోటీలు ప్రారంభమవుతాయి.

బాధితులకు సత్వర న్యాయం చేయాలి

'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్



ఫిర్యాదు దారులతో ముఖాముఖి మాట్లాడుతున్న ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్

కడప అర్బన్ : 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'లో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పై సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'(పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడారు. వారి సమస్యను విని సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేసి, వారి సమస్యను పరిష్కరించాలని సూచించారు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలనీ, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు, డి.టి.సి డిఎస్పీ అబ్దుల్ కరీం, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ, మాజీ ఎంపీపీ ఇంటిపై దాడి అమానుషం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి

- నిందితులను అరెస్టు చేయాలి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన క్యాదర్శి శ్రీకాంత్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి జెడ్పీటీసీ రమాదేవి, మాజీ ఎంపీపీ అంపాబత్తిన రెడ్డయ్య ఇంటిపై, కుటుంబంపై దాడి చేయడం అమానుషం, సిగ్గుమాలిన చర్య అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. లక్కిరెడ్డిపల్లి మండలం, జాంద్రపల్లిలో సోమవారం జెడ్పీటీసీ రమాదేవి, మాజీ ఎంపీపీ అంపాబత్తిన రెడ్డయ్య కుటుంబాన్ని స్థానిక నాయకులతో కలిసి శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. ఇంటిలో ధ్వంసమైన వస్తువులను, కాల్చేసిన బుల్లెట్ బైక్‌ను పరిశీలించారు. బాధిత కుటుంబానికి తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం శ్రీకాంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ బీసీ నాయకుడు అంపాబత్తిన రెడ్డయ్య సుమారు 15 ఏళ్ల సర్పంచ్‌గా, ఐదేళ్ల క్రితం ఎంపీపీగా, ప్రస్తుతం ఆయన సతీమణి రమాదేవి జెడ్పీటీసీగా కొనసాగుతున్నారన్నారు. వారి గ్రామంలో ప్రభుత్వం కేటాయించిన నిధులతోపాటు కొంత నిధులు కలిపి గ్రామాభివృద్ధికి పరితపిస్తున్న వ్యక్తి రెడ్డయ్య అని తెలిపారు. బీసీల రక్షణ చట్టం తెస్తామని కూటమి నాయకుల మాటలు ఏమయ్యాయి? ఇది భక్షక చట్టం కాదా? అని ఆయన ప్రశ్నించారు. అధికారం ఉంది కదా అని రాజకీయాలతో, ద్వేషాలతో ఇళ్లలోకి చొరబడి మహిళలుపైన దాడులు చేసి బీభత్సవం చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ పాలనలో సామాన్యులకు రక్షణ లేదని, మహిళలు రోడ్డుపైకి వచ్చే పరిస్థితి లేదన్నారు. వందలు, వేల మంది మహిళలు అదృశ్యమవుతున్నారన్నారు. ప్రశ్నిస్తే వారిపై దాడులు చేస్తున్నారన్నారు. ఈ నియోజకవర్గాన్ని గతంలో తాము ప్రశాంతంగా తీర్చి దిద్దామన్నారు. ప్రస్తుతం నాలుగు లక్షల జనాభా కల్గిన నియోజకవర్గంలో ప్రజల ఆత్మస్థైర్యం దెబ్బతినే విధంగా కొంతమంది ప్రవర్తిస్తున్నారన్నారు. నలభై, యాభై మంది తాగుబోతులు, గంజాయి తాగేవారు అరాచకాలు చేస్తుంటే చూస్తూ ఊరుకుంటామా అని ఆయన హెచ్చరించారు. మహిళలపై దాడికి పాల్పడి గ్రామంలో అలజడి సృష్టించిన దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇటువంటి సంఘటనలపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు దృష్టి పెట్టాలన్నారు. సుదీర్ఘకాలం రాజకీయాలలో ఉన్న అంపాబత్తిన రెడ్డయ్య ఇంట్లోకి అక్రమంగా, దౌర్జన్యంగా ప్రవేశించి సామాన్లు, అద్దాలను ధ్వంసం చేయడమే కాకుండా ఎనభై సంవత్సరాల వయస్సు ఉన్న ఆయన తల్లిపై, గర్భిణి అయిన కోడలిపై దాడి చేస్తారా? మీకు సిగ్గుందా అని ఆయన ప్రశ్నించారు. ఈ సంఘటన జరిగిన వెంటనే జిల్లా ఎస్పీతో కూడా మాట్లాడి దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. గాలివీడులో దాడి జరగకపోయినా దాడిలో చిత్రీకరించి నానా రభస చేశారని, అందుకోసం ప్రత్యేక విమానంలో వచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ రోజు బీసీ బిడ్డ కోసం నోరు తెరవరా అని ప్రశ్నించారు. పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే తమ ఆలోచనలను మార్చుకోవాల్సి వస్తుందన్నారు.ఈ సంఘటనపై జిల్లా అధికారులు, నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీజీపీ చిత్తశుద్ధితో ఆలోచనలు చేసి నిందితులను అరెస్టు చేయాలని శ్రీకాంత్ రెడ్డి కోరారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపీజీబీ కార్యాలయాన్ని తరలించవద్దు

కడప సెవెన్‌రోడ్స్ : కడపలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం కడప నుంచి తరలించరాదని వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి కోరారు. ఈ మేరకు అనంతపురంలో జరిగిన గ్రీవెన్స్‌సెల్ కార్యక్రమంలో ఆయన కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన కార్యాలయాన్ని తరలించడం ద్వారా రైతులు, ఈ ప్రాంతవాసులు నష్టపోతారన్నారు.



కలెక్టర్‌ను కలిసి సమస్యలను వివరిస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి

ప్రాక్టికల్స్‌ను పక్కాగా నిర్వహించాలి

డీఆర్‌ఓ విశ్వేశ్వరనాయుడు



సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్య

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా ఈ నెల 5 నుంచి ప్రారంభంకానున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ ప్రాక్టికల్ పరీక్షలను ఎటువంటి అనైతిక చర్యలకు తావు ఇవ్వకుండా నిష్పక్షపాతంగా నిర్వహించాలని డీఆర్‌ఓ విశ్వేశ్వరనాయుడు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని అన్ని డిపార్ట్‌మెంట్ అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు మిగిలిన డిపార్ట్‌మెంట్ అధికారులు సహకరించాలని సూచించారు. ప్రాక్టికల్స్‌లో ఎక్కడ కూడా ఆరోపణలకు తావు లేకుండా చూడాలని తెలిపారు. ఇంటర్ ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఇంటర్ ప్రాక్టికల్స్‌కు అందరు అధికారులు సహకరించాలని కోరారు. డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్ కమిటీ సభ్యులు పోలీసుశాఖ, ఆరోగ్యశాఖ, రవాణాశాఖ, విద్యుత్‌శాఖ, తపాలశాఖ, నగరపాలకశాఖ, పాఠశాల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అనంతరం పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. తొలుత పీజీఆర్ఎస్ నోడల్ అధికారి, జెడ్పీ సీఈవో ఓబులమ్మ పీజీఆర్ఎస్ దరకాస్తులపై ఆయా జిల్లా అధికారులతో సమీక్షించారు.వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హాకీ అసోసియేషన్‌లో జిల్లాకు రెండు పదవులు

– రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జె.రవిచంద్ర, జాయింట్ సెక్రటరీగా బి.లక్ష్మీదేవి



జె.రవిచంద్ర



బి.లక్ష్మీదేవి

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన ఆర్ఎస్ఐ జె.రవిచంద్ర, వ్యాయామ అధ్యాపకురాలు బి.లక్ష్మీదేవి దంపతులకు అరుదైన గౌరవం లభించింది. రవిచంద్ర హాకీ అసోసియేషన్‌లో రాష్ట్ర ఉపాధ్యక్షునిగా, లక్ష్మీదేవి రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా పదవులు పొందారు. రవిచంద్ర జిల్లా, రాష్ట్రం తరపున హాకీ జట్టుకు ప్రాతినిధ్యం వహించి జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచారు. మెరిట్‌లో పోలీస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించి హాకీ స్పోర్ట్స్ కోటాలో హెడ్‌కానిస్టేబుల్‌గా ప్రమోషన్ పొందారు. ప్రస్తుతం ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్‌లో ఆర్ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. మరోవైపు ప్రతిభ గల హాకీ క్రీడాకారులను తీర్చిదిద్దడంలో జిల్లా అసోసియేషన్ తరపున కృషి చేస్తున్నారు. ఈయన సతీమణి బి.లక్ష్మీదేవి అంతర్జాతీయ ఖోఖో జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్‌హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ హాకీ క్రీడాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు. తమకు రాష్ట్రస్థాయి పదవులు రావడం పట్ల హాకీ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ నిరంజన్‌రెడ్డి, రాష్ట్ర ప్రెసిడెంట్ చాణిక్యరాజు, రాష్ట్ర సెక్రటరీ హర్షకు ధన్యవాదాలు తెలిపారు. వీరికి హాకీ అసోసియేషన్ సముచిత స్థానం కల్పించడం పట్ల మాజీ హాకీ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, జిల్లా సెక్రటరీ శేఖర్, పలువురు ప్రముఖులు, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

బెంగళూరులో పులివెందుల యువకుడి ఆత్మహత్య

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని నగరిగుట్ట సమీపంలో నివాసముంటున్న మాజీ కౌన్సిలర్ సూర్యనారాయణరెడ్డి మనుమడు, అమరనాథ్ రెడ్డి, అనితల కుమారుడు అరవిందనాథ్ రెడ్డి(22) రెండు రోజుల క్రితం బెంగళూరులో ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పులివెందుల పట్టణంలో అమరనాథ్ రెడ్డి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి కుమారుడు అరవిందనాథ్‌రెడ్డితో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అరవిందనాథ్‌రెడ్డి బెంగళూరులోని సూపర్ మార్కెట్‌లో పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం విషద్రావణం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

లారీ బోల్తా - డ్రైవర్ మృతి



బోల్తాపడిన లారీ

కాశినాయన : మండలంలోని రామచంద్రాపురం గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం లారీ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ సంఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. డ్రైవర్ రాజుగా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి సిమెంట్ లోడుతో ప్రొద్దుటూరుకు వెళుతుండగా ఈ సంఘటన జరిగింది. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రూ.2వేలు డబ్బు ఇవ్వలేదని చిరువ్యాపారి హత్య




మృతి చెందిన మోహన్

పులివెందుల రూరల్ : బాకీ ఉన్న రూ.2వేల డబ్బు ఇవ్వలేదని మోహన్ అనే వ్యాపారిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. పులివెందుల పట్టణానికి చెందిన మోహన్ అనే వ్యక్తి తోపుడు బండి మీద అరటి పండ్లు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అయితే ఒక కోల్డ్ స్టోరేజ్ వ్యక్తి వద్ద అరటి పండ్లు కొనుగోలు చేసి రూ.2వేలు బాకీ ఉన్నాడు. బాకీ చెల్లించలేదని కోల్డ్ స్టోరేజ్ యజమాని, మరొక వ్యక్తితో కలిసి మోహన్‌ను పిడి గుద్దులు గుద్దాడు. దీంతో అతను అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఇది గమనించిన స్థానికులు హుటాహుటిన ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు భార్యతో విడిపోయి మతిస్థిమితం లేని కుమారునితో జీవనం సాగిస్తున్నాడు.

పటిష్ట ప్రణాళికతో

మార్కులు పదిలం



- మార్చి 17 నుంచి 31 వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు
- మారిన సిలబస్, పరీక్షా విధానం
- మంచి మార్కులకు నిపుణుల సూచనలు

పదవ తరగతి విద్యార్థి దశలో అత్యంత కీలకం. విద్యార్థుల బంగారు భవితకు పునాది. ఉన్నత శిఖరాల అధిరోహణకు తొలిమెట్టు. అలాంటి పదవ తరగతి పరీక్షలు మార్చి 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలంటే పదింతల ప్రణాళిక ఉండాలి. అలా ఉంటే వందశాతం ఉత్తీర్ణత సాధించవచ్చని విషయ నిపుణులు అంటున్నారు.

కడప ఎడ్యుకేషన్

తెలుగు పరీక్ష పత్రంలో..



1.అవగాహన ప్రతిస్పందన: ఇది బాగా రాసేందుకు అచ్చుపుస్తకం అవసరమవుతుంది. పద్య పాఠ్యాంశాలలోని తేటగీతి, ఆటవెలది, కంద పద్యాలను, (నీతిగలవి) చూసుకుంటే సరిపోతుంది. జవాబులు సంపూర్ణ వాక్యాలుగా రాయాలి. ప్రశ్నలను తయారుచేసేందుకు ప్రశ్నార్థక పదాలు (ఎవరు ? ఏమిటి ? ఎవరికి ? ఏ ?ఎన్నవ ? ఎలా?, ఎందుకు?) గుర్తుంచుకొని తయారు చేయాలి. పరిచిత గద్యానికి గద్యాంశ పాఠాలు చూసుకోవాలి. 2. వ్యక్తీకరణ సృజనాత్మకతలో పద్యభాగం నుంచి కవిపరిచయాలు, గద్యభాగం నుంచి నేపథ్యం ప్రక్రియలు చూసుకుంటే సరిపోతుంది. వ్యాస రూప ప్రశ్నలు రాసేటప్పుడు కీలకాంశాలకు గుర్తింపునిస్తూ కింద గీత గీయాలి. వ్యాఖ్య రూపంలో మీ అభిప్రాయం కూడా చెబితే సదభిప్రాయం ఏర్పడుతుంది. ప్రతిపాఠం చివర ఉన్న భాషాంశాలు, అచ్చు పుస్తకం చివర ఉన్న పదవిజ్ఞానం చూసుకొని చదవాలి. జవాబులు వరుసగా రాయాలి. ప్రశ్నల సంఖ్యలు సరిగా వేయాలి. విరామ చిహ్నాలు పాటించడం ముఖ్యం. ప్రతి జవాబు తర్వాత రెండు సన్నని గీతలు గీయటం, శీర్షికలు రాయటం, విభాగాల పేరు రాయటం, వ్యాస రూప ప్రశ్నలకు జవాబులను మూడు చిన్న పేరాలుగా విభజించుకొని రాయటం, అర్థమయ్యే దస్తూరి రాయటం, జవాబు జవాబుకు మధ్య కొంత స్పష్టత ఉండేలా చూసుకోవటం చేస్తే మంచి మార్కులు సాధించవచ్చు.

- జీవీ సాయిప్రసాద్, తెలుగు, జెడ్పీ హైస్కూల్, వల్లూరు

సాధనతో హిందీ పరీక్షలో ఉత్తమ మార్కులు..



పాఠ్య పుస్తకం కొత్తది. ప్రశ్నాపత్రంలో మొత్తం ఆరు భాగాలుంటాయి. ఇందులో బాషాకిబాత్ 12 మార్కులు, అర్థ గ్రాహ్యత- ప్రతిక్రియ-20 మార్కులు, కవుల జీవిత చరిత్ర-08 మార్కులు, ఉపవాచకం-24 మార్కులు, పద్య, గద్యభాగం 20 మార్కులు, ఆరవ విభాగం 16 మార్కులు ఉంటాయి. మొదటి భాగంలో 12 ప్రశ్నలు వ్యాకరణం సంబంధించినవి. సరళమైన వ్యాకరణాంశాలు నేర్చుకొని, పట్టిక తయారు చేసుకోవాలి. 20 మార్కుల రెండవ భాగంలో ప్రశ్నలోని కీలక పదాన్ని ప్యాసేజీలో వెతికి సమాధానం గుర్తించవచ్చు. మూడవ భాగం కవి పరిచయాలలో కబీర్‌దాస్, మీరాబాయి నేర్చుకుంటే చాలు. ఇక 24 మార్కుల నాల్గవ భాగంలో 8 ప్రశ్నల్లో ఆరింటికి సమాధానం నాలుగు వాక్యాల్లో రాయాలి. 19వ ప్రశ్నకు సాఖి పాఠంలోని మొదటి నాలుగు దోహాలు నేర్చుకోవడం ఉత్తమం. 27వ ప్రశ్నకు పద్యభాగంలోని పద్, పర్వత్ ప్రదేశ్‌మే పావస్ సారాంశాలు కవి పరిచయాలతో సహా నేర్చుకుంటే చాలు. 28వ ప్రశ్నకు గద్యభాగంలోని బడే భాయి సాహబ్, డైరీ కా ఏక్ పన్నా పాఠాల సారాంశం లేఖక్ పరిచయం సహా నేర్చుకొని ఉప శీర్షికలతో 8 వాక్యాలకు తక్కువ కాకుండా రాస్తే మంచిది. 29వ ప్రశ్నలో పత్రలేఖన్. పత్రలేఖన్ ఔపచారిక్, అనౌపచారిక్ విధానాన్ని తెలుసుకుంటే ఎలాంటి విషయమైనా లేఖ రాయవచ్చు. ఛుట్టీపత్ర్, పితాజీకో పత్ర్, మిత్ర్‌కో పత్ర్, పుస్తక విక్రేతాకే నాం పత్ర్ మొదలైనవి నేర్చుకోవాలి. 30వ ప్రశ్నలో నాలుగు వ్యాసాలు ఇస్తారు. ఒక వ్యాసాన్ని నిబంధ్ ఉప శీర్షికలతో పది వాక్యాలు తగ్గకుండా రాయాలి. మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలను మొదట బాగా చదివి, తర్వాత సమాధానాన్ని గుర్తించాలి. చక్కని చేతిరాత, వ్యాకరణ దోషరహిత వాక్య నిర్మాణంతో జవాబు రాయాలి.

- ఎఫ్.ఎం.ఎస్.ఖాదర్, హిందీ, జెడ్పీ హైస్కూల్, ఎగువపల్లె

ఆంగ్లంపై ఆందోళన వద్దు..



ఆంగ్ల పరీక్షపై ఆందోళన వద్దు. మొత్తం ఒకే పేపరుగా 100 మార్కులకు ఉంటుంది. సెక్షన్-ఏ రీడింగ్ కాంప్రహెన్షన్, సెక్షన్-సీ క్రియేటివ్ ఎక్స్‌ప్రెషన్ లకు ఒక్కోదానికి 30 చొప్పున 60 మార్కులుంటాయి. సెక్షన్-బీ లో వకాబులరీ, గ్రామర్ కలిపి 40 మార్కులుంటాయి. వీటిని ఉపాధ్యాయుల సహాయంతో సందేహాలు నివృత్తి చేసుకొంటూ సాధన చేయాలి. కాంప్రహెన్షన్ లో ముందుగా పేరాను ఒకటి, రెండు సార్లు క్షుణ్ణంగా చదవాలి. ప్రశ్నలోని కీలక పదం (కీ వర్డ్) గుర్తించి, వాటి ఆధారంగా పేరాలో జవాబును వెదికి రాయాలి. అన్ని ప్రశ్నలకు జవాబులు రాయాలి. సమయపాలన, తప్పొప్పుల సవరణకు నమూనా ప్రశ్నా పత్రాలతో మాదిరి పరీక్షలు రాసి సాధన చేయడం ఉత్తమం. ప్రశ్నలను వరుసగా రాయడం, ప్రశ్నల నంబరు సరిగా వేయడం, కొట్టివేతలు లేని చక్కటి చేతిరాత కూడా ముఖ్యం. క్రియేటివ్ రైటింగ్‌లో లెటర్, డైరీ, డైలాగ్, పేరాగ్రాఫ్, ప్రశ్నల రూపకల్పన, డేటా అనాలసిస్ వర్ణన అంశాలకు సంబంధించి, ప్రశ్నను చదివి అర్థం చేసుకొని సొంతంగా రాసేవిధంగా సాధన చేయాలి.

- డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు, ఇంగ్లీషు సబ్జెక్టు, జెడ్పీ హైస్కూల్, ఎగువపల్లి

అవగాహనతో సాధన చేస్తే విజయం నీదే..



ప్రశ్నాపత్రం ఒక్కటే అయినప్పటికి జవాబు పత్రాలు భౌతికశాస్త్రం, జీవశాస్త్రం వేర్వేరుగా ఇస్తారు. ఇందులో జీవన విధానాలు (విసర్జన), నియంత్రణ- సమన్వయం, ప్రత్యుత్పత్తి పాఠాలలోని పటాలను (బొమ్మలను) సాధన చేయాలి. దీంతోపాటు పట్టికలు, పేరాగ్రాఫ్‌ల రూపంలో ఉన్న అంశాలను బాగా చదివి, తర్వాత సంబంధిత మాదిరి ప్రశ్నలకు సమాధానం రాయడం సాధన చేయాలి. ప్రయోగాలు, కృత్యాలు, తేడాలు, భేదాలు రాయడం లాంటి అంశాలను అవగాహనతో అధ్యయనం చేయాలి. ఏదైనా ఒక అంశం గురించి నినాదాలు, ప్రశ్నల తయారీ పైన ప్రత్యేక అవగాహన కలిగి ఉండాలి. అలాగే అన్ని పాఠాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలి.

- కె.బాలకృష్ణ, జీవశాస్త్రం ఉపాధ్యాయుడు, జెడ్పీ బాలుర హైస్కూలు, ఎర్రగుంట్ల

సాంఘిక శాస్త్రాన్ని అర్థం చేసుకుని..



సాంఘికశాస్త్రంలో చరిత్రను అర్థం చేసుకుని బట్టీ పద్ధతిలో కాకుండా, ప్రశ్న తీరును అర్థం చేసుకొని మార్కులకు తగినట్లు జవాబు రాయాలి.రాజుల పాలన, ప్రపంచ, దేశ చిత్రపటాలపై పట్టు సాధిస్తే అధిక మార్కులు పొందే అవకాశం ఉంటుంది. భారతదేశ ప్రధాన భౌగోళిక స్వరూపాలు, పర్యావరణ ఉద్యమాలు, నేలల రకాలు, వ్యవసాయ పద్ధతులు, చరిత్రలో జాతీయోద్యమాలు, జాతీయాదాయం, తలసరి ఆదాయం, జనవనరులు, సంస్కృతి, ఆధునిక ప్రపంచీకరణ వాటి పరిణామాలు, భారత ఆర్థిక వ్యవస్థ అంశాలపై పట్టు సాధించాలి. ప్రపంచపటం, భారతదేశపటం గుర్తించేటప్పుడు సెక్షన్, మ్యాప్ ప్రశ్న నంబర్ స్పష్టంగా రాయాలి. సమయాన్ని గమనిస్తూ, అన్ని ప్రశ్నలకు జవాబు రాసి చివరలో సరిచూసుకోవాలి.

- ఆర్.రాజేశ్వరి, సోషల్ టీచర్, జెడ్పీహైస్కూల్, గుడిపాడు

భౌతిక రసాయన శాస్త్రం..



పాఠ్యపుస్తకాల ఆధారంగా మొదటిసారి జరుగుతున్న పరీక్షలలో జనరల్ సైన్స్ పేపర్ 1 (భౌతిక రసాయన శాస్త్రం) 50 మార్కులకు ఉంటుంది. దీనిలో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావడం చాలా తేలిక. బాష్పీభవనం, హ్రస్వదృష్టి, దీర్ఘ దృష్టి లోపాల సవరణ, ఎండమావులు, ఇంద్రధనస్సు ఏర్పడే విధానం, విద్యుత్తు మోటారు. ఏసీ జనరేటర్, డీసీ జనరేటర్ పనిచేసే విధానం, క్వాంటాం సంఖ్యలు, నూతన ఆవర్తన పట్టిక నిర్మాణం, ఘన పదార్థపు విశిష్టోష్ణం కనుగొనడం, ఆమ్లాలు, క్షారాలు, లవణాలు, కాంతి - పరావర్తనం - వక్రీభవనం అడిగే దానికి అవకాశం ఎక్కువగా ఉన్నది. జవాబులు రాసేటప్పుడు క్రమపద్ధతి పాటించాలి. ప్రశ్నల క్రమసంఖ్య మార్జిన్ బయట వేసి, అర్థం అయ్యేలా రాస్తే పూర్తి 50 మార్కులు తెచ్చుకోవచ్చు.

- వి.ఎన్.క్రిష్ణకిషోర్, ఫిజికల్ సైన్సు, జెడ్పీహైస్కూల్, పాయసంపల్లి

గణిత పరీక్షలో నూటికి నూరు మార్కులు..



గణిత పుస్తకంలో ఉండే 14 చాప్టర్ల నుంచి 8 లేదా 9 చాప్టర్‌లను సింపుల్ టు కాంప్లెక్స్ పద్ధతిలో రివిజన్ చేయడం ఉత్తమం. వాస్తవ సంఖ్యలు, బహుపదులు, రెండు చర రాశులలో రేఖీయ సమీకరణలు, జత, నిరూపక జ్యామితి, త్రికోణం యొక్క అనువర్తనాలు, వృత్తాలు, సంబంధిత వైశాల్యాలు, సాంఖ్యక శాస్త్రం, సంభావ్యత ఈ తొమ్మిది అధ్యాయాల నుంచే మంచి మార్కులు వస్తాయి. సులువుగా ఉండే ప్రశ్నలను ముందుగా చేయాలి. దీంతో మనకు మనోధైర్యం వస్తుంది. పరీక్షకు వచ్చే విద్యార్థులు పుష్టికరమైన భోజనాన్ని తినాలి. రోజు కొంత సమయం వ్యాయామం చేయాలి. సబ్జెక్టు పరంగా అవసరమైతే ఉపాధ్యాయులు, స్నేహితుల సహకారం తీసుకోవాలి.

- జీఎం. మహమ్మద్ అస్లాం, మేథమాటిక్స్, శంకరాపురం, కడప

మార్కెట్ విలువ మేరకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రొద్దుటూరు రూరల్ : వేంపల్లె నుంచి ఎర్రగుంట్ల మీదుగా చాగలమర్రికి వెళ్లే జాతీయ రహదారి 440కు సంబంధించిన భూ నిర్వాసితులకు ప్రస్తుత మార్కెట్ విలువ మేరకు నష్టపరిహారం చెల్లించాలని బాధితులు డిమాండ్ చేశారు.

ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం కొత్తపల్లె రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 267 భూ నిర్వాసితులు 20 మంది ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా ఏళ్ల క్రితం కష్టపడి సంపాదించిన డబ్బుతో ఇళ్ల స్థలాలను కొన్నామని, ప్రస్తుతం ఆ స్థలాల్లో నేషనల్ హైవేకి అధికారులు కొలుతలు వేసి రాళ్లు పాతడం బాధాకరమన్నారు. రెవెన్యూ అధికారులు ఖాళీ పత్రాలపై సంతకాలు చేయమని ఒత్తిడి చేస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి నేషనల్ హైవే 440 అలైన్‌మెంట్‌ను మార్చాలన్నారు. అనంతరం తహసీల్దార్ గంగయ్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో భూ నిర్వాసితులు దశమందం బాబు, రమణారెడ్డి, రమణయ్య, వెంకటేష్, చెంచుపల్లె నారాయణరెడ్డి, నాగార్జున, మదనగోపాల్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ గంగయ్యకు వినతి పత్రం ఇస్తున్న బాధితులు

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం : రూరల్ పరిధిలోని కానపల్లె గ్రామంలో తాటి గంగయ్య (54) అనే వ్యక్తి మన స్థాపంతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గంగయ్య, రాజమ్మ భార్యా భర్తలు. వీరికి పిల్లలు లేరు. భార్యాభర్తలు కూలి పని చేసుకొని జీవించేవారు. సీజన్‌లో గంగయ్య పొట్టేళ్లను పెంచుకొని విక్రయించుకునేవాడు. గంగయ్య స్వగ్రామం ముద్దనూరు మండలంలోని తిమ్మాపురం. కానపల్లెలోనే పెళ్లి చేసుకొని 35 ఏళ్ల నుంచి అక్కడే ఉంటున్నాడు. గ్రామంలో ఉన్న తమ 5 సెంట్ల స్థలాన్ని విక్రయించి సొంతూరు తిమ్మాపురం గ్రామానికి వెళ్లాలని భావించారు. ఈ క్రమంలో రెండు నెలల క్రితం స్థలాన్ని విక్రయించారు. స్థలం విక్రయించిన డబ్బు విషయమై భార్యాభర్తలు ఆదివారం రాత్రి గొడవ పడ్డారు. దీంతో భార్య రాజమ్మ రాత్రి భయంతో ఇంటి నుంచి వెళ్లిపోయి గ్రామంలోనే ఉన్న బంధువుల ఇంట్లో పడుకుంది. రాత్రి నిద్రపోయిన గంగయ్య సోమవారం వేకువ జామున చూసే సరికి ఇంటి ముందు ఉన్న రేకుల షెడ్డులోని ఇనుప పైపునకు తాడుతో ఉరి వేసుకున్నాడు. భార్యతో పాటు బంధువులు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ సురేష్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి తమ్ముడు గంగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పులివెందులలో..

పులివెందుల రూరల్ : ముద్దనూరు రోడ్డు సమీపంలోని జయమ్మ కాలనీలో నివాసముంటున్న సంజీవరాయుడు(30) అనే వ్యక్తి సోమవారం రాత్రి ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, బంధువుల కథనం మేరకు వివరాలు ఇలా.. సంజీవ రాయుడు పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో టైలరింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత కొంతకాలంగా చెవి నొప్పితో తీవ్రంగా బాధపడుతుండేవాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

దాడి కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

పులివెందుల రూరల్ : జనవరి 29వ తేదీన తొండూరు మండలం ఇనగలూరు గ్రామానికి చెందిన దస్తగిరి రెడ్డిపై జరిగిన దాడి కేసులో నలుగురు నిందితులలో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ మురళీ నాయక్ తెలిపారు. సోమవారం స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జనవరి 29వ తేదీన ఇనగలూరు గ్రామానికి చెందిన దస్తగిరిరెడ్డి అలియాస్ బాబు రెడ్డి సొంత పని నిమిత్తం పులివెందులకు వచ్చాడన్నారు. తన పని ముగించుకుని తిరిగి గ్రామానికి వెళ్తున్న సమయంలో గ్రామ సమీపంలో అదే గ్రామానికి చెందిన మోరంరెడ్డి సమరసింహారెడ్డి, మోరంరెడ్డి హరి కిశోర్ రెడ్డి అలియాస్ కిశోర్ కుమార్ రెడ్డి, మోరంరెడ్డి బాల ఓబుల్ రెడ్డి, భాస్కర్ రెడ్డిలు కాపు కాచి దాడి చేశారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసుకు సంబంధించి పులివెందుల రూరల్ సీఐ రమణ ఆధ్వర్యంలో సింహాద్రిపురం ఎస్ఐ తులసీ నాగప్రసాద్, తొండూరు ఎస్ఐ చిన్న ఓబన్న, వారి సిబ్బంది సోమవారం ఉదయం నిందితులను అరెస్టు చేశారన్నారు. నిందితులు తమ వ్యవసాయ పొలంలో సుమారు రెండేళ్ల క్రితం నాటిన సుమారు 350 చీనీ చెట్లకు కరువు పని బిల్లులు చేయించుకునే విషయమై, దస్తగిరి రెడ్డికి, నిందితులకు మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయన్నారు. ఇందులోభాగంగానే ఈ దాడి జరిగిందన్నారు. కాగా ఈ కేసుకు సంబంధించి మరో నిందితుడు ఒక దినపత్రికలో విలేకరిగా పనిచేస్తున్న భాస్కర్ రెడ్డి పరారీలో ఉన్నాడని తెలిపారు. అతని కోసం గాలిస్తున్నామన్నారు. సమావేశంలో సీఐ వెంకటరమణ, ఎస్ఐలు తులసీ నాగప్రసాద్, పెద్ద ఓబన్న, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

కమలాపురం : ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్) సీఎంఓ సాయి రమేష్ తెలిపారు. మండల పరిధిలోని నల్లలింగాయపల్లెలో ఉన్న బీసీసీపీఎల్ లో సోమవారం రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్లాంట్ మెయిన్ గేట్ ఆవరణంలో భద్రతా పతాక ఆవిష్కరణతో పాటు ఉద్యోగులు, కార్మికుల చేత భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. భద్రతా చిట్కాలు కలిగిన కార్డులను ఉద్యోగులు, కార్మికులు కాలనీలోని డీఏవీ భారతి విద్యా మందిర్ విద్యార్థులకు అందజేశారు. కార్మికులు, ప్రజలతో కలసి హెల్మెట్ ధరించి ప్లాంట్ తో సమీప గ్రామాల్లో ద్విచక్ర వాహనం ర్యాలీ నిర్వహించి రోడ్డు భద్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి వేగం ప్రమాదకరం అన్నారు. ముఖ్యంగా బైక్‌లో వెళ్లేటప్పుడు హెల్మెట్, కార్లలో వెళ్లే సమయంలో సీటు బెల్ట్ తప్పని సరిగా ధరించాలన్నారు. ఒక్క నిమిషం ఆలస్యం అయితే వచ్చిన నష్టం ఏమీ లేదని, త్వరలో వెళ్లాలనే ఆత్రుతతోనే ప్రమాదాల బారిన పడుతున్నారని వివరించారు. వాహనాలు నడిపే సమయంలో ఒక్కసారి తన కుటుంబం గురించి ఆలోచించాలన్నారు. మద్యం సేవించి, అధిక లోడుతో, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదన్నారు. ఈ కార్యక్రమంలో లాజిస్టిక్ హెడ్ కలిశెట్టి, హెచ్ఆర్ హెడ్ గోపాల్‌రెడ్డి, ప్రాజెక్ట్స్ హెడ్ జగదీశ్వర్ రెడ్డి, భద్రతా అధికారి మహేశ్వర్‌రెడ్డి, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.



ప్లాంట్ వద్ద బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న సీఎంఓ సాయి రమేష్

ఆధిక్యంలో ఆంధ్రా జట్టు

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న కల్నల్ సీకే నాయుడు అండర్ -23 అంతర్ రాష్ట్రాల క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్రా జట్టు ఆధిక్యంలో కొనసాగుతోంది. 159 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో బరిలో దిగిన హిమాచల్ ప్రదేశ్ జట్టు 124.3 ఓవర్లలో 436 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జట్టులోని ఆర్యవట్‌శర్మ 75 పరుగులు, మ్రిదుల్ పి సూర్రోచ్ 152 పరుగులు చేశారు. ఆంధ్రా బౌలర్లు వాసు 5, శ్రీకర్ 3, రాజు 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్రా జట్టు మూడో రోజు ఆట ముగిసే సమయానికి 8 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 30 పరుగులు చేసింది. జట్టులోని రేవంత్ రెడ్డి 15 పరుగులతో క్రీజ్‌లో ఉన్నాడు. ఆంధ్రా జట్టు 138 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.



152 పరుగులు చేసిన మ్రిదుల్ పి సూర్రోచ్



75 పరుగులు చేసిన ఆర్యవట్‌శర్మ

ప్రథమ చికిత్స కేంద్రం సీజ్

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణం వేంపల్లి రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న విజయ జ్యోతి ప్రథమ చికిత్స కేంద్రాన్ని సీజ్ చేసినట్లు ఎర్రగుంట్ల పట్టణ ఆరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని ప్రథమ చికిత్స కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేంపల్లి రోడ్డులోని విజయ జ్యోతి ప్రథమ చికిత్స కేంద్రంలో ఆర్ఎంపీ వైద్యుడు దస్తగిరి నిబంధనలకు విరుద్ధంగా ఇంజెక్షన్ చేస్తున్నారని చెప్పారు. దీంతో ఆసుపత్రిని సీజ్ చేసినట్లు తెలిపారు. ఆర్ఎంపీలు ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



ప్రథమ చికిత్స కేంద్రాన్ని సీజ్ చేస్తున్న ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

హంద్రీ నీవా కాలువ నీటి సామర్థ్యం పెంచాలి

మదనపల్లె: హంద్రీనీవా కాలువ నీటి సామర్థ్యాన్ని పదివేల క్యూసెక్కులకు పెంచి, రాయలసీమకు సాగు, తాగునీరు అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ పనులు పూర్తి చేసి, మదనపల్లెకు మంచినీరు అందించాలని, అందుకు సంబంధించిన నిధులను రాబోయే బడ్జెట్‌లో కేటాయించాలని కోరారు. సోమవారం సబ్ కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలైన కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు హంద్రీనీవా ప్రాజెక్ట్ ద్వారా దాదాపు 6 లక్షలకు పైగా ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వాల్సి ఉందన్నారు.

చెరువు ఆక్రమణదారులపై కేసు నమోదు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని గంగేపేరూరులో గల చిన్న చెరువును ఆక్రమించిన వారిపై సోమవారం ఒంటిమిట్ట ఎస్ఐ శివప్రసాద్ కేసు నమోదు చేశారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు కడప ఇరిగేషన్ సహాయ కార్యనిర్వహణాధికారి ఎస్.సాయి కిషోర్ ఫిర్యాదు మేరకు గంగేపేరూరు గ్రామంలోని సర్వే నంబరు. 150లో 116.50 ఎకరాల విస్తీర్ణం ఉంది. ఇందులో ఆర్ఎస్ఆర్ ప్రకారం చిన్న చెరువు ఉంది. సదరు చెరువును ఆనుకుని ఉన్న పట్టా భూముల రైతులు 26.03 ఎకరాల చెరువు భూమిని ఆక్రమించినట్లు విలేజ్ రెవెన్యూ అధికారి నివేదిక ఇచ్చారు. గత ఏడాది సెప్టెంబర్ 21వ తేదీన సుమారు వారం రోజులు రెవెన్యూ అధికారులతో కలిసి ఆక్రమణలను తొలగించి సరిహద్దుల కందకాలను తవ్వించారు. కానీ ఈ చెరువును తిరిగి కొంతమంది ఆక్రమించారని తెలియడంతో జనవరి 25వ తేదీన రెవెన్యూ అధికారులతో పరిశీలించారు. 13.68 ఎకరాల భూమిని అదే వ్యక్తులు ఆక్రమించారని విలేజ్ రెవెన్యూ అధికారులు నివేదించారు.

హోంగార్డ్స్ క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

హోంగార్డ్స్ కమాండెంట్ ఎం. మహేష్‌కుమార్

కడప అర్బన్ : పోలీసు శాఖలో హోంగార్డుల సేవలు అభినందనీయమని, క్రమశిక్షణతో విధులను నిర్వర్తించాలని హోంగార్డ్స్ కమాండెంట్ ఎం. మహేష్‌కుమార్ తెలిపారు. సోమవారం కడప పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో హోంగార్డులు పెరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమాండెంట్ మాట్లాడుతూ క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తూ మంచిపేరు తీసుకురావాలన్నారు. హోంగార్డుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. సంవత్సరానికి ఒకసారి మెడికల్ చెకప్ చేసుకోవాలన్నారు. హోంగార్డుల దైనందిన విధులు సవాళ్లతో కూడుకున్నవన్నారు. ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. డ్రిల్, కవాతు, ప్రముఖుల బందోబస్తు, ట్రాఫిక్ తదితర విధులు మరింత సమర్థవంతంగా ఎలా నిర్వహించవచ్చో వివరించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య, ఏ.ఆర్. డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐ శ్రీశైలం రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్‌కుమార్